

విద్యుత్‌లో పని భారం..!


- 1994 జిఒ ప్రకారమే డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లు - భారీగా పెరిగిన విద్యుత్ కనెక్షన్లు - ఇంజినీర్లపై, సిబ్బందిపై పెరిగిన భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

విద్యుత్ వినియోగదారులకు సేవలందించేందుకు 1994 నాటి జిఒ ప్రకారం అప్పట్లో డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లను ఏర్పాటు చేశారు. ఆ తరువాత విద్యుత్ కనెక్షన్లు భారీగా పెరిగినా డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లను పెంచలేదు. దీంతో విద్యుత్ శాఖలో కీలకంగా వ్యవహరించే ఇంజనీర్లు, సిబ్బందిపై పనిభారం పెరిగింది...

విద్యుత్ శాఖలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కార్మికులతో పాటు ఇంజనీర్లు, సిబ్బంది కూడా కీలకమే. వారిపై పనిభారం పెరుగుతోంది. 1994లో జిఒ 94 ప్రకారం వర్క్‌నార్మ్స్ రూపొందించారు. దాని ప్రకారం డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లను ఏర్పాటు చేశారు. అర్బన్ ప్రాంతాల్లో 7500 విద్యుత్ కనెక్షన్లకు ఒక డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌ను, రూరల్ ప్రాంతాల్లో 6వేల విద్యుత్ కనెక్షన్లకు ఒక డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌లో 18 మంది సిబ్బంది ఉండాలి. అందులో ఒక ఎఇ, ఒక సబ్ ఇంజనీరు, పవర్‌మెన్, ఇద్దరు లైన్ ఇన్స్‌పెక్టర్లు, 10 మంది లైన్‌మెన్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఒక ఆఫీస్ సబార్డినేట్ ఉండాలి. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో అర్బన్ 6,21,098 విద్యుత్ కనెక్షన్లు, రూరల్ ప్రాంతాల్లో 6,03,757 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 1994 వర్క్ నార్మ్స్ ప్రకారం అర్బన్ ప్రాంతాల్లో 82 డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లు, రూరల్ ప్రాంతాల్లో వంద డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లు ఉండాలి. ఆ లెక్కల ప్రకారం కర్నూలు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో 182 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు(ఎఇలు), దానికి అనుగుణంగా సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం దాదాపు వంద మంది ఎఇలు మాత్రమే ఉన్నారు. పెరిగిన విద్యుత్ కనెక్షన్ల ఆధారంగా డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లను పెంచకపోవడంతో ఉన్న ఇంజనీర్లు, సిబ్బందిపై పని భారం విపరీతంగా పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో 7500 విద్యుత్ కనెక్షన్లకు, గ్రామీణ ప్రాంతాల్లో 6వేల విద్యుత్ కనెక్షన్లకు ఎఇలు సేవలు అందించాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కో ఎఇ 20 వేల నుంచి 25వేల విద్యుత్ కనెక్షన్లకు సేవలు అందించాల్సి వస్తోంది. పెరిగిన వినియోగదారులకు అనుగుణంగా కర్నూలు నగరంలో 26 డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఏడు డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లు మాత్రమే ఉన్నాయి. అహర్నిశలు శ్రమిస్తున్నా ప్రయోజనం లేని పరిస్థితుల్లో విద్యుత్ శాఖ ఇంజనీర్లు, సిబ్బంది విసిగిపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి తలరాతలు మారడం లేదు. పెరిగిన విద్యుత్ కనెక్షన్లను అనుగుణంగా డిస్ట్రిబ్యూషన్ సెక్షన్‌లను పెంచకపోవడం, ఇంజనీర్లను, సిబ్బందిని పెంచకపోవడంతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో కొంత ఇబ్బంది ఎదురవుతోందని కొందరు ఇంజనీర్లు, సిబ్బంది చెబుతున్నారు.





విద్యార్థులు తాగడానికి

నీళ్లు ఎక్కడ..?



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు

- వినియోగంలో లేని ఆర్‌ఒ వాటర్ ప్లాంట్లు - రూ.లక్షల్లోనే నిధులు వృథా

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు తాగడానికి నీళ్లు అందించేందుకు ఆర్‌ఒ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసినా ఫలితం లేదు. శుద్ధమైన నీటిని విద్యార్థులకు అందించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారు. కర్నూలు నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ స్మారక ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం హయాంలో నాడు నేడు పథకం కింద విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు నాలుగు ఆర్‌ఒ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.10 లక్షల పైగానే ఖర్చు చేశారు. పాఠశాలలో దాదాపుగా 1400 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఆర్‌ఒ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు . దీని నుండి విద్యార్థులకు రోజువారిగా తాగునీటిని అందించడం లేదు. రూ లక్షలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేస్తే కనీసం వినియోగంలోకి రాకపోవడంతో విద్యార్థులు తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల వద్ద నుండే తాగునీటి బాటిల్స్ తీసుకొని వస్తున్న పరిస్థితి ఉంది. ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ద్వారా విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు పెద్ద మొత్తంలో కూడా ఖర్చు కాదు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి తాగునీటి వాటర్ ప్లాంట్లను మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేసేందుకు తగిన నిధులను కేటాయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వదిలేశారు



- దూదే కొండ కుమార్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు గాను ఆర్‌ఒ మినరల్ వాటర్ ప్లాంట్లకు లక్షలు ఖర్చుపెట్టినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేలా మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

తాగునీటిని సరఫరా చేయాలి



కె. నాగరాజు విద్యార్థి తండ్రి

విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి. మినరల్ ఆర్‌ఒ వాటర్ ప్లాంట్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విద్యాశాఖ నిధులను విడుదల చేయాలి.

స్వచ్ఛతాహి సేవలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు సూచనలివ్వండి
- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలో స్వచ్ఛతాహి సేవ, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామాలన్నింటిని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక నిర్దిష్టమైన స్థలాన్ని ఏర్పాటు చేసుకొని అక్కడే చెత్త వేసేలా చూడాలన్నారు. నిరుపయోగంగా ఉన్న చెత్తను క్లాప్ మిత్రల ద్వారా షెడ్‌కు తరలించి రీసైక్లింగ్ చేస్తారన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలను వివరిస్తూ కర పత్రం అందరికీ అందజేయడం తో పాటు స్టిక్కర్స్‌ను ఇంటింటికీ అతికిస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న పెన్షన్ దారులందరికీ ప్రతి నెల 1న పెన్షన్ ఇస్తున్నామన్నారు. పెన్షన్ పంపిణీలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచామన్నారు. స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని కలెక్టర్ వివరిస్తూ, 2047 నాటికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా, అప్పటికి మన గ్రామానికి, మండలానికి, జిల్లా అభివృద్ధి సమగ్రంగా సాధించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించుకుంటున్నామన్నారు.. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌కు సంబంధించి ఫీడ్‌బ్యాక్ ఫామ్స్ ఇస్తామని, అందులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే, 11 ప్రశ్నలు వస్తాయని, వాటి మీద తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. తద్వారా రాష్ట్రం గ్రామం, జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను తయారు చేసుకొని, వాటిని అమలు చేస్తామన్నారు. 'స్వచ్ఛతాహిసేవ' కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై గ్రామస్తులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలోని 9 మంది షెడ్‌మిత్రా, క్లాప్ మిత్రలకు జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సర్పంచి భూపాల్ రెడ్డి, ఎంపిపి శారద, జిల్లా పరిషత్ సిపిఒ నాసర రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.



చెట్లమల్లాపురంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలి

- సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకునే బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎస్‌పి జి.బిందుమాధవ్ సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కర్నూలులోని ఆయా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, కళాశాలల ప్రిన్సి పల్స్, హెచ్‌ఒడిలు, అధ్యాపకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడు తూ... యాంటీ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై, సోషల్ మీడియా, రోడ్డు భద్రత, సైబర్ నేరాల పట్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహ న సదస్సులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నా రు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకునే విధంగా తీర్చిదిద్దాలన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలన్నా రు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ అనేవి నేరమని, ఎవరైనా తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలుంటాయని భవిష్యత్తు కోల్పోతారని తెలపాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు యువత ధైర్యంతో ఎదుర్కొవాలే తప్ప ఆత్మహత్య అనేది సమస్యలకు పరిష్కారం కాదని తెలియజేయాలన్నారు. మాదకద్రవ్యాల బారినపడి విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా క్రయ, విక్రయాలు జరిపినా లేదా సేవించినా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అతిగా సెల్ ఫోన్ వినియోగం , సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియా వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనవసర లింకులు షేర్ చేయకూడదని, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లోన్ యాప్ లు , ఇన్వెస్ట్‌మెంట్లు,ఎపికె ఫైల్స్ , బెట్టింగ్ యాప్స్ లాంటి వాటితో మోసపోకూడదని విద్యార్థులకు తెలపాలన్నారు. సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930కి సమాచారం అందించి, సైబర్ క్రైమ్ పోర్టల్ లోwww.cybercrime.gov.inకు ఫిర్యాదు చేసేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయాలంటే ఒక్క పోలీసు వ్యవస్థతోనే సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కర్నూలులోని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్,హెచ్‌ఒడిలు, అధ్యాపకులు, స్పెషల్ బ్రాంచి సిఐ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ ఖాజావలి పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జి.రామకృష్ణ

రైతులను మోసగించిన ప్రభుత్వం

- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చి గద్దెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పైసా ఇవ్వలేదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ విమర్శించారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రైతులను మోసగించిందన్నారు. బుధవారం కర్నూలు కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రైతు సంఘం మండల అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ధర్నానుద్దేశించి జి.కృష్ణ మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీతో రైతులు, కౌలు రైతులు భారీ మెజార్టీతో గెలిపించారని అన్నారు. అలాంటి రైతులకు విత్తనాల సమయం నాట్లు వేసే సమయం అయిపోయినప్పటికీ సాయం అందించలేదన్నారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లను బిగించే జీవో 22న ఇంతవరకు రద్దు చేయలేదన్నారు. 2023 ఖరీఫ్‌లో రబీలో కరువు వల్ల నష్టపోయిన రైతంగానికి నేటికీ పంట నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. ఇది మంచి ప్రభుత్వమని ప్రభుత్వం కార్యక్రమాలు జరపడం విడ్డూరంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలకు రూ.11 లక్షల 50 వేల కోట్ల రుణాలు మాఫీ చేశారని రైతులను పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వమైనా కేరళ తెలంగాణ తరహాలో రైతుల రుణాలు రూ.రెండు లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు రైతాంగాన్ని కదిలిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు ఈ తాండ్రపాడు గ్రామ సర్పంచి బాలపీర, పంచలింగాల మాజీ సర్పంచి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్ , వెంకటయ్య, లోకన్నా, మద్దిలేటి, చిన్నబడే సాహెబ్ ,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, రైతులు తిమ్మప్ప, జి మద్దిలేటి, ఆంజనేయులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలించి వివరణ కోరుతున్న కమిషనర్ రవీంద్రబాబు

మెరుగ్గా పారిశుధ్యపనులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు నిర్వహించాలని ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం రాజీవ్‌గృహకల్ప, శ్రీవెంకటేశ్వర నగర్, బాబా బృందావన్‌నగర్, రాఘవేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కృష్ణారెడ్డి నగర్‌లో శిథిలావస్థకు చేరిన 200 కెఎల్ వాటర్ ర్యాంకును పరిశీలించి, వెంటనే మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్‌తో పాటు ఆరోగ్యధికారి డాక్టర్ వి.విశ్వేశ్వర్ రెడ్డి, డిఇఇ రవిప్రకాష్ నాయుడు, ఎఇ జనార్ధన్ తదితరులు ఉన్నారు.



ఇందిగా గాంధీనగర్‌లో రోడ్డుపైనే చెత్త, మురుగునీరు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగ రంలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో సుందరయ్య భవన్ ముందు భారీగా పేరుకు పోతున్న చెత్త సమస్య , డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా పాడై రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు సమస్యను పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం అనేకసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవిస్తే తాత్కాలికంగా క్లీన్ చేస్తున్నారు తప్ప పరిష్కారం చూపడం లేదని అన్నారు. డ్రెయినేజీ పొంగిపొర్లడంతో రోజు రోడ్డుపై తిరిగే స్థానిక ప్రజలందరూ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భారీగా చెల్లాచెదురుగా చెత్తపడి ఉండడం వల్ల దోమలు పందులు విపరీతంగా పెరిగి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మంత్రి టీజీ భరత్, మున్సిపల్ కమిషనర్ ఒకసారి పర్యటించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇందిరాగాంధీ నగర్ ప్రజలకు తీవ్రమైన అనారోగ్యాల పాలై హాస్పిటల్ పాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శిరీష , ఎస్ఎఫ్ఐ జిల్లా నగర అధ్యక్షులు రంగప్ప, అమర్ ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటరాముడు, స్థానికులు చాంద్ బాష,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుంటే పనులు అడ్డుకుంటాం: సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రైతుల భూములకు పరిహారం ఇవ్వకుంటే పనులు అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి.నారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కర్నూలు గుంటూరు జాతీయ రహదారి కోసం భూములు ఇస్తున్న రైతులతో కలిసి బుధవారం కర్నూలు రూరల్ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు గుంటూరు జాతీయ రహదారి కోసం రెవిన్యూ అధికారులు భూములు సేకరించారని తెలిపారు. వారి మ్యాపు ప్రకారం రోడ్డు వేయకుండా రోడ్డు మార్చడమే కాకుండా భూములు తీసుకున్న రైతులకు పరిహారం ఇవ్వడం పై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకపోతే పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతుల నుండి భూమి తీసుకుంటున్న సందర్భంలో కనీస సమాచారం ఇవ్వకుండా పనులు ప్రారంభించి రైతులను ఇబ్బందులు పెట్టిన అధికారులు కాంట్రాక్టర్లపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి పిబి హుస్సేనయ్య మండల నాయకులు రాఘవేంద్ర, మృత్యుంజయుడు నాయకులు ఆంజనేయులు, బాధిత రైతులు మధు, పెద్దమద్దిలేటి, తిక్కన్న, బాల వెంకటేశ్వర్లు, రాముడు, పరుశరాముడు, తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు?

మురళీకృష్ణ నాయకత్వంలో కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిసిసి అధ్యక్షుడు పి. మురళీకృష్ణ సీఎం చంద్రబాబు నాయుడును ప్రశ్నించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వినూత్న రీతిలో గరిటలు ప్లేట్లు పట్టుకొని నిరసన తెలియజేశారు. పి మురళీకష్ణ మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు 100 రోజులైనా అమలు చేయకపోవడం ప్రజలను మోసగించడమేనని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. లేకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు,సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్‌జిలానీబాష, ఇతరనేతలు పిజినరసింహులుయాదవ్, అనంతరత్నం, దామోదరంరాధాకృష్ణ, వెంకటరెడ్డి, పోతుల శేఖర్, ఎస్ ప్రమీల, కార్యకర్తలు పాల్గొన్నారు.


1న సిఎం పత్తికొండకు రాక?

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గంలో అక్టోబర్ 1న పర్యటనకు రానున్నట్లు తెలిసింది. గురువారం సీఎం పర్యటన ఉంటుందని సిఎంఒ అధికార వర్గాలు జిల్లా కలెక్టర్ కు సమాచారం చేరవేశారు. వెంటనే గంటలోగా తిరిగి పర్యటన రద్దు చేసినట్లు సమాచారం ఇచ్చారు. అక్టోబర్ ఒకటవ తేదీన సీఎం పర్యటన తప్పనిసరిగా ఉంటుందని కలెక్టరుకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిసింది.

గౌరుచరితను కలిసిన వైసిపి ఎంపిటిసి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పటల్



కల్లూరు మండలం పెద్దటేకూరు దొడ్డిపాడు గ్రామాల అభివద్ధికి వైసిపి ఎంపిటిసి సభ్యులు కురువ మునిస్వామి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని కలిశారు. ముని స్వామి మాట్లాడుతూ పెద్దటేకూరు, దొడ్డిపాడు అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని మునిస్వామి కోరారు. కార్యక్రమంలో పెద్దటేకూరు దొడ్డిపాడు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం ఆచరణలో శూన్యం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల సంక్షేమం పై సమీక్ష సమావేశంలో ఊరించడమే తప్ప ఉద్ధరణ కనుచూపుమేరలో కనిపించడం లేదని అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ సుభాన్ ,రాష్ట్ర కమిటీ సభ్యులు, పి.ఇక్బాల్ హుస్సేన్, మొహమ్మద్ షరీఫ్ లు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ఘాటుగా విమర్శించారు. సిఎం నిర్వహించిన ముస్లిం మైనార్టీ సమీక్ష సమావేశంలలో, ముస్లిం మైనార్టీల అభివృద్ధి గురించి, వారి సంక్షేమం గురించి, ఆలోచిస్తూ అధికారులను ఆదేశిస్తూ, అభివృద్ధి కోసం తపిస్తున్నట్టు ఉంది తప్ప, ఆచరణలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి ఆమడ దూరంలో ఉందన్నారు. ప్రభుత్వానికి ముస్లింల పట్ల, ముస్లింల సమస్యలపట్ల ,వాటి పరిష్కారం పట్ల, చర్యలు కనుచూపుమేరలో కనపడడం లేదని చెప్పారు. ముస్లిం మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ గురించి, ముస్లిం మైనార్టీల యువతకు ఉపాధి కల్పన గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూముల రక్షణ గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వానివి మాటల గారడి తప్ప ఆచరణ లేదన్నారు. ముస్లిం మైనార్టీల ఆర్థిక, సాంఘిక ,విద్య ,ఉద్యోగ, ఉపాధి ,కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధి లేదని లోపాయికారిగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల ముందు ముస్లిం మైనార్టీలకు, ఇచ్చిన వాగ్దానాలను, నెర వేర్చే వైపు ఆలోచించాలని అవాజ్ కమిటీగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులను విడుదల చేసి, స్వయం ఉపాధికి ,రకరకాల వృత్తుల్లో ఉన్న వారికి ,నేరుగా రూ.లక్ష రుణాలను ఇవ్వాలని ,యువతకు, ఉద్యోగ, ఉపాధి కల్పించే చర్యలను తీసుకోవడం ద్వారా ఈ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల పట్ల ,వారి అభివృద్ధి పట్ల పాటుపడుతుందని, నిరూపించుకోవాలని అవాజ్ కమిటీగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



రగ్బీ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

బాలికలు క్రీడల్లో పాల్గొనాలి

అంతర్ జూనియర్ కాలేజీల రగ్బీ పోటీలను ప్రారంభించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

బాలికలు క్రీడల్లో పాల్గొనడం వల్ల గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం అలవడుతుందని, తద్వారా జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కోవచ్చని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని ఆదర్శ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్ జూనియర్ కళాశాలల రగ్బీ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో గెలుపు ఓటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించినప్పుడే జీవితంలో ఎదుగుదల సాధ్యమవుతుందని వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మహిళా సాధికారత ఎంతో అవసరమని వివరించారు. ముఖ్యంగా బాలికల అక్షరాస్యత అధికంగా ఉన్న రాష్ట్రం దేశం అభివృద్ధి చెందడంలో ముందు ఉంటుందని అన్నారు. మన దేశంలోని కేరళ రాష్ట్రంలో అక్షర అక్షరాస్యతా శాతం అధికమని, అక్కడి బాలికలు ఎక్కువగా చదువుకోవడం వల్ల దేశ విదేశాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితి ఆంధ్రప్రదేశ్ లో కూడా రావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆడపిల్లలు బయటికి వెళితే ఇంటికి వచ్చేంతవరకు తల్లిదండ్రులలో ఆందోళన నెలకుంటుందని, అలాంటి పరిస్థితి లేకుండా ఆడపిల్లలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు క్రీడల్లో పాల్గొనడం వల్ల ఏకాగ్రత మానసిక దృఢత్వం పెంపొందించడంతోపాటు శారీరక ఎదుగుదల చక్కగా ఉంటుందని వివరించారు. కర్నూలు నగరంలో క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని డాక్టర్ శంకర్ శర్మ వెల్లడించారు.

గొర్రెలపెంపకందారుల సహకార సంఘాల ఎన్నికకు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహణ నిమిత్తం కర్నూలు డివిజన్ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.దుర్గాప్రసన్నబాబును ఎన్నికల అధికారిగా కలెక్టర్ నియమించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 26న ఎన్నికల ప్రకటన, అక్టోబరు 5న నామినేషన్ల స్వీకరణ, అక్టోబరు 7న నామినేషన్ల పరిశీలన, 8న ఉపసంహరణ, అదే రోజున నికరమైన తుది జాబితా ప్రకటిస్తారు. 22న 12 డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు, అదే రోజున జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఉంటుందని కర్నూలు డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ , ఎన్నికల అధికారి డాక్టర్ వి. దుర్గాప్రసన్నబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెట్టుబడి సాయం అందించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు




ఆదోనిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు అందించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీమా పరిహారం అందించాలని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించవద్దని డిమాండ్ చేశారు. రైతు రుణాలు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, వ్యకాస జిల్లా నాయకులు లింగన్న, రైతు సంఘం మండల నాయకులు హనుమంతురెడ్డి, మునిస్వామి, ఉసేన్, ఏలియా పాల్గొన్నారు. **పెద్దకడబూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, వ్యకాస నాయకులు తిక్కన్న, రైతు సంఘం నాయకులు ఈరన్న, ఓబులేసు పాల్గొన్నారు. **ఆలూరులో** ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ గోవిందు సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు అందజేయాలని ఏపి రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కెపి.నారాయణ స్వామి, కృష్ణ, పరమేష్ గౌడ్, షేకన్న, రామాంజి, మైనా పాల్గొన్నారు.

వరద బాధితులకు 'ప్రతిభ' ఆర్థిక సాయం



డిడిని అందజేస్తున్న ప్రతిభ యాజమాన్యం

ప్రజాశక్తి - కౌతాళం

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కలిసి రూ.50 వేలు అందజేశారు. బుధవారం రూ.50 వేల డిడిని కెనరా బ్యాంకు మేనేజర్ సద్దాం వలీ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపినట్లు కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు మేనేజర్ సద్దాం వలీ మాట్లాడారు. ప్రతిభ హైస్కూల్ వారు విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక దృక్పథం నేర్పించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఆదర్శవంతులుగా తయారు కావాలని చెప్పారు. అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను ఆచరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొని మండలానికి ఆదర్శ విద్యార్థులుగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్, పాఠశాల పర్యవేక్షకులు భీమేష్, రాజు, జయలక్ష్మి, శిరీష, ముంతాజ్, ఖాజా పీర్, సీనియర్ ఉపాధ్యాయులు ఈరన్న, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలకు పని భారం తగ్గించాలి

- ఎన్‌జిఒస్ అధ్యక్షులు ఉషారాణి

ప్రజాశక్తి - ఆదోని

సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న గ్రామ/వార్డు హెల్త్ సెక్రటరీలకు పని భారం తగ్గించాలని ఎన్‌జిఒస్ అధ్యక్షులు ఉషారాణి, నాయకులు బజారి, మంజునాథ్ కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎంపిడిఒ గీతావాణిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హెల్త్ శాఖలో వారు నిర్వర్తిస్తున్న కార్యకలాపాలను ఇప్పటికే సుమారు 72 యాప్‌లలో నమోదు చేస్తున్నారన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనాలని క్షేత్రస్థాయిలో ఇన్‌ఛార్జీలు ఒత్తిడి చేయడం వల్ల మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. సమస్యను జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారని, ఇతర పనులు అప్పగించరాదని సర్క్యులర్ ఇచ్చారని చెప్పారు. ఇతర కార్యకలాపాల నుంచి హెల్త్ సెక్రటరీలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. వైద్య విస్తరణ అధికారి లక్ష్మీనారాయణ ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వందరోజుల్లోనే అభివృద్ధి

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



పెద్దకడబూరులో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం వందరోజుల్లో చేసిందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. బుధవారం పెద్దకడబూరులో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఎంపీ హాజరయి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పాటు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని వదిలేసి కేవలం దోచుకోవడం, దాచుకోవడం కోసమే పనిచేసిందని విమర్శించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, మాజీ ఎంపిపి శశిరేఖ, జనసేన ఇన్‌ఛార్జీ లక్ష్మన్న, ప్రత్యేకాధికారి వెంకటేష్, ఎంపిడిఒ జనార్దన్, టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, నాయకులు హనుమంతు రెడ్డి, మల్లికార్జున, ఏసేపు, విజయ్ కుమార్, అంజి, రామాంజి, ఈరన్న, వీరేష్ గౌడ్, నరసన్న పాల్గొన్నారు. **దేవనకొండ** గ్రామ సచివాలయ ఆవరణలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. అంతకుముందు మండలంలోని వరిముక్కల నాగేశ్వరరావు అనే రైతు పొలంలో ఎఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. పి.కోటకొండ, వెలమకూరు, ఎంకె.కొట్టాల గ్రామాల్లో అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప, బిజెపి ఇన్‌ఛార్జీ వెంకట రాముడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఈదుల దేవరబండ సుభాన్, మాలిక్, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, వెంకటస్వామి గౌడ్, నీలకంఠ గౌడ్, రాజా సాబ్, మాల బండ్లయ్య, తెర్నేకల్ చిన్న రాముడు, చిట్యాల రామాంజనేయులు, జనసేన, బిజెపి నాయకులు ఉచ్చీరప్ప, జగదీష్, రవి పాల్గొన్నారు. **ఆదోని**లోని శంకర్ నగర్‌లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ శాంత, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ హాజరయ్యారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి మాట్లాడుతూ... కాలనీ సమీపంలో ప్రవహిస్తున్న మురుగు నీటి ద్వారా కల్లుబావికి చెందిన రైతులు వందల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. వంకలో పూడిక తొలగించి నీటి ప్రవాహం పెరిగేలా చూడాలని కోరారు. **నందవరంలో** టిడిపి మండల నాయకులు, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ పుష్పవతి 'ఇది మంచి ప్రభుత్వం' చేపట్టారు. టిడిపి నాయకులు నల్లంగి మల్లికార్జున గౌడ్, తలారి నరసప్ప, రహిమాన్, రఫీ, విశ్వనాథ్ గౌడ్, చిదిగి నాగరాజు, తెలుగు నవీన్ పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న భూపాల్ చౌదరి



దేవనకొండలో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

ఎమ్మెల్యే కాన్వాయి అడ్డగింపు

ఆదోని : పట్టణంలో ఎమ్మెల్యే పార్థసారథి కాన్వాయిని అడ్డుకున్నారు. 'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే పార్థసారథి శంకర్ నగర్‌కు వెళ్లా రు. కాలనీ వాసులు ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప కాన్వాయిని అడ్డుకున్నారు. కాలనీవాసులు రాము, నాగేంద్ర, చంద్ర, గిరి, సాయిరాం మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటి జోలికి వెళ్లకుండా అధికారులు గల్లీలో అక్రమ నిర్మాణాలంటూ తొల గించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంగా నిర్మాణాలు చేసుకున్నామని, రోడ్ల వెడల్పు పేరుతో జెసిబితో కూల్చడమేమి టని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... మురుగు కాలువపై నిర్మాణాలు మాత్రమే తొలగింపు చేయిస్తు న్నామని తెలిపారు. ఉన్నపలంగా నిర్మాణాలు తొలగిస్తే ఎక్కడికి వెళ్లేదంటూ స్థానికులు వాపోయారు. కాలనీలో పర్య టించి అక్రమ నిర్మాణాలు వద్దని స్థానికులకు ఎమ్మెల్యే నచ్చ జెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేను కలి సేందుకు ఉన్న వారి పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని తెలిపారు.



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని ముద్దనగేరి గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గుర్రె శ్రీనివాసులు (28) మృతి చెందారు. మృతుని తండ్రి హనుమంతు ఫిర్యాదు మేరకు... మధ్యాహ్నం ఇంట్లో కుళాయికి మోటార్ కనెక్షన్ ఇచ్చే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గుర్రె కుప్పకూలి పడిపోయారు. ఆలూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు మూడేళ్ల క్రితం మైసూర్‌కు చెందిన రూప అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి 14 నెలల కుమార్తె ఉంది. తల్లిదండ్రులు, భార్య, బంధువుల ఆర్తనాదాలు అందరినీ కంటతడి పెట్టించాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

చదువుతూ పోటీల్లో రాణించాలి

- ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానంలో జరిగిన టోర్నమెంట్‌లో బుధవారం రెండో రోజు బాలికల క్రీడా పోటీలు ప్రారంభించారు. అంతకుముందు మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచి చాలామంది మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. బాగా చదివితే ఉద్యోగం వస్తుందని, క్రీడాకారులకు పేరుతో పాటు ప్రతిష్టలు కూడా పెరుగుతాయని చెప్పారు. కబడ్డీ, ఫుట్‌బాల్, ఖోఖో, త్రో బాల్ పోటీలు విద్యార్థినుల మధ్య సాగాయి. మైదానంలో కబడ్డీ ఆడి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, మున్సిపల్ చైర్మన్ శాంత, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుడిసె ఆది కృష్ణమ్మలు క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడల్లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్నారు. విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు నరసయ్య, రామన్న, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, హలీం సిద్ధిక్, నాయకులు రేణువర్మ, రాజశేఖర్, నాయకులు మల్లిక, ఫిజికల్ డైరెక్టర్ కిర ఉన్నారు.



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

యువత అభ్యున్నతికి కృషి

- అక్టోబర్ 4న జాబ్ మేళా - ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, యువత అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అక్టోబర్ 4న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17 కంపెనీల ద్వారా సుమారు 810 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి న్యాయవాదుల పాలాభిషేకం

కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే బీవీతో కలిసి న్యాయవాదులు పాలాభిషేకం చేశారు. న్యాయవాదులు రషీదుల్లా, నారాయణ, నర్సిరెడ్డి, గురు ప్రసాద్, రామకృష్ణ నాయుడు, పోలకల్ వెంకటేష్, ఆనంద్, రాజు, దస్తగిరి, ఏసు, కిషోర్ పాల్గొన్నారు.

టిడిపితోనే ముస్లింల సంక్షేమం

ముస్లింల సంక్షేమం టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే బీవీ తెలిపారు. రాష్ట్రంలో ప్రతేడాది హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించేలా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం పట్టణంలోని ముస్లిం, మైనారిటీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే బీవీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్‌గా అల్తాఫ్

కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్‌గా గట్టు అల్తాఫ్‌ను, సభ్యులుగా సోగనూరు బోయ రాఘవేంద్ర, పట్టణంలోని వడ్డే రవి కుమార్, కుమ్మరి లక్ష్మన్నను ఎమ్మెల్యే బీవీ ప్రకటించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపుతామని తెలిపారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తమపై నమ్మకంతో కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్‌గా ఉన్నత స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యే బీవీకి గట్టు అల్తాఫ్ కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు 'బస్సు ఏర్పాటు చేయాలి'

ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరు నుంచి సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు బస్సు ఏర్పాటు చేయాలని ఆర్‌యుఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. బుధవారం ఆర్‌టిసి సిఐ నాగరాజుకు ఆర్‌విఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది, ఆర్‌యుఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు నుంచి సెయింట్ జాన్స్ కళాశాలకు విద్యార్థులు బస్సు పాస్‌లు కట్టారని తెలిపారు. బస్టాండ్‌లో సమయపాలన పాటించకుండా బస్సులు వస్తున్నా యని, విద్యార్థులు నిలదీస్తే దుర్భాషలాడుతు న్నారని చెప్పారు. విద్యార్థులు కళాశాలలకు ఆల స్యంగా వెళ్లడంతో తరగతులు మిస్ అవుతున్నారని తెలిపారు. ఆర్‌టిసి సిఐ స్పందిస్తూ... సమయానికి బస్సు ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. విద్యార్థులు రాజేష్, మాలిక్, శివ, మధు పాల్గొన్నారు.

'భీమవరం ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి'

ఆస్పరి : భీమవరం ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని చించి వేసి దళితులను అవమానించా రని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ రంగరయ్య మెడికల్ కళాశాల ప్రొఫెసర్, సీనియర్ డాక్టర్ ఉమా మహేశ్వరరావును కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ దూషించారన్నారు. చంద్ర, నాగరాజు, లక్ష్మన్న, రంగస్వామి, బాలు, భరత్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల

సమస్యలపై పోరాటానికి సిద్ధం

- 12 డైరెక్టర్లకు ఎన్నికల్లో పోటీ చేస్తాం
- ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల దారుల జిల్లా గౌరవాధ్యక్షులు కె.మల్లేష్, అధ్యక్షులు కె.రాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా గొర్రెలు, మేకల పెంపకం దారుల జిల్లా చైర్మన్, వైస్ చైర్మన్, 12 డైరెక్టర్ల ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 26న విడుదల కానుందని తెలిపారు. అక్టోబర్ 22న పోలింగ్ ఉంటుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో తమ సంఘం పోటీ చేస్తుందన్నారు. గతంలో ఎన్నుకున్న సంఘం సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లు గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమం కోసం ప్రతేడాది రూ.24 కోట్లు జిల్లాకు విడుదల చేస్తుందన్నారు. గతంలో ఉన్న చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ ఉపయోగించు కోలేకపోయారని తెలిపారు. రూ.కోటి, రూ.50 లక్షలు, రూ.25 లక్షలు, రూ.5 లక్షలు, రూ.లక్ష వరకు యూనిట్లను మంజూరు చేస్తుందని, గతంలో వీటిని వినియోగించుకోలేకపోయారని చెప్పారు. ఈ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. అలాగే చనిపోయిన గొర్రెలు, మేకలకు రూ.6 వేలు చెల్లించాల్సి ఉందని, గత ఐదేళ్లుగా ఒక్క పైసా కూడా రాలేదని తెలిపారు. బెడ్ పాలక్ బీమా పాలసీ కింద గొర్రెలు, మేకల పెంపకం దారులు రూ.8 చెల్లిస్తే నష్టపరిహారం వచ్చేదన్నారు. నాబార్డ్ కింద వచ్చే నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం ఎత్తి వేసిందని తెలిపారు. గొర్రెలు, మేకల షెడ్లకు నిధులు కేటాయించాలని కోరారు. గొర్రెల సొసైటీల భూముల అన్యాక్రాంతాన్ని అరికట్టాలని, పశు గ్రాసం కోసం అసైన్డ్ బంజరు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకల మేత కోసం, నీటిని అందించాలని, గొర్రెలు, మేకలకు సంక్రమించే వ్యాధులు అరికట్టడానికి మందులను ప్రభుత్వం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారు ల సంఘం జిల్లా నాయకులు నాగరాజు, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు

చిన్నమరివీడులో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో వెంకటేష్ (34) అనే వ్యక్తికి డెంగీ వ్యాధి సోకినట్లు మండల వైద్య సిబ్బంది తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు, గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. కేసు నమోదయిన ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు అబెట్, పైరిత్రియం ద్రావణంతో పిచికారి చేయించామన్నారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లా, వైద్య సిబ్బంది సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఆదోని

కంటి, పంటి, ఆయుర్వేద, వాస్కులర్ మెగా వైద్య శిబిరానికి స్పందన వచ్చిందని సౌజన్యకర్త కాకుబాళ్ నగేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టిజి.పాండురంగయ్య శెట్టి, రాచోటి సుధాకర్‌లు శిబిరాన్ని ప్రారంభించారు. 15 మంది డాక్టర్లతో, 35 మంది వైద్య సహాయకులతో రెండు మెడికల్ కళాశాలలు, మూడు పెద్ద ఆస్పత్రుల అనుసంధానంతో అవోపా, వామ్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 1,186 మంది హాజరై 18 వైద్య విభాగాల్లో ఉచిత సంప్రదింపులు, మందులు, వైద్య సేవలు పొందారని అవోపా, వామ్ పట్టణ అధ్యక్షులు వంగదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. ఉచిత దంత పరీక్షల శిబిరంలో, అర్హులకు రూ.2 వేల విలువైన ఉచిత దంత వైద్య పరీక్షలు, (స్కేలింగ్) ఎక్స్ రే, మందులు ఇచ్చామన్నారు. ఉచిత రక్తనాళాల పరీక్షల శిబిరంలో అర్హులకు రూ.4500 విలువగల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు సౌజన్య కర్త కాకుబాళ్ నగేష్ వివరించారు. సంఘం నాయకులు డైమండ్ రఘు, కోశాధికారి యాదగిరి, వెంకటేశ్వర్లు, వెంకటేష్ బాబు, ప్రతాప్, ఈరన్న శెట్టి, విజయ్ కుమార్, టిటిఈ రవి, రత్నయ్య, రాజేష్, కిరణ్, రామకృష్ణ, కాలేపల్లి విశ్వనాథ్, మాకం శ్రీధర్, అవోపా మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, సంగీత, హిమ బిందు, వంకదారు గీత, శ్రీదేవి, అనిత, అనూష ఉన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు : జైభీమ్ ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - మంత్రాలయం

మాల దాసరి, దాసరి కుల ధ్రువీకరణ పత్రాలను ఎస్సీలుగా తహశీల్దార్ కార్యాలయం నుంచి మంజూరు చేయవద్దని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ, జిల్లా కార్యదర్శి రత్నం, మండల అధ్యక్షులు గాడిమోడి నరసింహులు, మాల మహానాడు నాయకులు నరసన్న మాట్లాడారు. మండలంలో మాల దాసరి, దాసరి అనే కులాలు ఎస్సీ కులాలు కాదని, బి, సి, డి వర్గానికి చెందిన వారని చిలకలడోన గ్రామ ఎస్సీలు కోర్టులో కేసు వేశారని చెప్పారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ నాయకులు కందనాతి మారెన్న, నాగేంద్ర, మండల కార్యదర్శి గర్జి ప్రకాష్, నాయకులు చెట్నపల్లి అజయ్, నరసింహులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్

ప్రజాశక్తి - కోసిగి

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ తెలిపారు. బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కోసిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జెవివి నిర్వహించే పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు సైన్సు పట్ల ఆసక్తి, అభిరుచి, పోటీ తత్వం విద్యార్థి దశ నుంచే అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సమాజంలో గూడు కట్టుకుపోయిన మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలను రూపుమాపవచ్చని చెప్పారు. విద్యార్థులు దేనిని గుడ్డిగా విశ్వసించకుండా ప్రశ్నించే తత్వాన్ని చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడారు. ఆదోని డివిజన్‌లో సుమారు 6 వేల మంది విద్యార్థులు చెకుముకి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. పాఠశాల స్థాయి విజేతలు మండల స్థాయి పోటీ పరీక్షలకు అర్హత సాధిస్తారని చెప్పారు. ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, గురు స్వామి, శుభాన్ సింగ్, రవికుమార్, నాగప్రసాద్, రహీం బాష, ధనుంజయుడు, అంతయ్య, అబ్దుల్ రషీద్, రామన్న, మల్లికార్జున, సులేమాన్, మేఘనాథ్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలో జెవివి ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, ఎరిగేరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు చెకుముకి టాలెంట్ టెస్టును ప్రారంభించారు. కౌతాళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రతిభ హై స్కూల్, ఎరిగేరి, కామవరం, ఉరుకుంద, రౌడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. యుటిఎఫ్ నాయకులు రంగన్న, వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, ఉపాధ్యాయులు మాధురి, రేణుక, దేవమ్మ పాల్గొన్నారు. **గోనెగండ్ల** జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూర్బా పాఠశాల, ఏపి మోడల్ స్కూళ్లలో జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్సు టాలెంట్ టెస్టు నిర్వహించారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఉపాధ్యాయులతో కలిసి ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. 300 మంది విద్యార్థులు ఈ చెకుముకి టాలెంట్ పరీక్షలను రాశారు. మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ పద్మావతి, ఎస్‌టియు రాష్ట్ర మాజీ నాయకులు హెచ్.తిమ్మన్న, ఉపాధ్యాయులు గుమ్మల బాబు, ఉస్మాన్, అబ్దుల్ సలీం, తాజుద్దీన్, రంగస్వామి, ఉమా, మణికుమారి, అమానుల్లా బేగ్, రామచంద్ర రావు, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.



కోసిగిలో చెకుముకి పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



కౌతాళంలో చెకుముకి పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు